'గిన్నిస్' రికార్డు సాధించిన ఐఏడీవీఎల్


గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందుకుంటున్న ఐఏడీవీఎల్ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: చర్మ వ్యాధులపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించిన అంశం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిందని ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనిరాలజిస్ట్స్, లెప్రాలజిస్ట్స (ఐఏడీవీఎల్) సెక్రటరీ జనరల్, సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి డెర్మటాలజీ వైద్యుడు కటకం భూమేష్‌కుమార్ తెలిపారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఐఏడీవీఎల్ ఆధ్వర్యంలో ఈనెల 5న మధ్నాహ్నం 12 నుంచి మరుసటి రోజు 11.59 నిమిషాల వరకు 24 గంటల సమయంలో దేశవ్యాప్తంగా చర్మవ్యాధులపై అవగాహన కల్పించి 9405 మంది వైద్యులతో ప్రతిజ్ఞలు చేయించామని వివరించారు. ఈ అంశం గిన్నిస్ వరల్డ్ రికార్డుగా గుర్తించిన సంస్థ ప్రతినిధి రిషినాథ్ ఢిల్లీలోని ఐఏడీవీఎల్ కేంద్ర కార్యాలయంలో ఈనెల 18న జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందించారన్నారు. సర్టిఫికెట్ ప్రధాన కార్యక్రమంలో ఐఏడీవీఎల్ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షెనయ్, ప్రతినిధులు రాజీవ్‌శర్మ, విజయ్‌జవార్, కవిత, వికాస్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అవాకేర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం


శ్రీనివాస్ శ్రీవాత్సవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాక కేంద్రంగా ప్రఫుల్లా మెమోరియల్ ట్రస్ట్, అవాకేర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అమోఘమని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ శ్రీవాత్సవ్ అన్నారు. వేసవి నేపథ్యంలో తార్నాక స్ట్రీట్ నెంబర్–1లో అవాకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమం బుద్ధ పూర్ణిమ రోజు ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని సమస్యలకు కారణమైన కోరికలను అదుపులో ఉంచుకోవాలని బుద్ధుడు చెప్పిన బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. దాదాపు గత 40 సంవత్సరాల నుంచి ఫ్యామిలీ కౌన్సెలింగ్, దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక బోధన, వేసవిలో చలివేంద్రం, మజ్జిగ పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. లక్కరాజు నిర్మల, నర్సింహారావు, మహిళా మండలి సభ్యులను అభినందించారు. అనంతరం శ్రీనివాస్ శ్రీవాత్సవ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓంప్రకాష్, ఫణిభూషణ్ లత, రమా రమ్య, మట్టం లత, కళ్యాణి పాల్గొన్నారు.

ముంపు ముప్పు నుంచి కాపాడండి

సీఈఓకు వినతి


సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న సతీష్‌గుప్తా

కంటోన్మెంట్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ముంపు ముప్పు నుంచి కాపాడాలంటూ కంటోన్మెంట్ ఐదో వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి తేలుకుంట సతీష్ గుప్తా, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీ పరిధిలోని వాసవీనగర్, జ్యోతి కాలనీ, ఓల్డ్ వాసవీ నగర్, బ్రూక్ బాండ్ కాలనీ, ప్రియా కాలనీ, గృహ లక్ష్మీ కాలనీ, సిరిపురి కాలనీ, వాసవీ బీ కాలనీ, విక్రమ్‌పురి, మారేడుపల్లి గణేశ్ నగర్, రైల్వే కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ముంపు సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆయా కాలనీల గుండా వెళ్లే నాలాలు ఉప్పొంగి కాలనీలను ముంచెత్తే ప్రమాదముందన్నారు. ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండిపోయిన నాలాల్లో వ్యర్థాలను తొలగించారు. గత అనుభవాల దృష్ట్యా కొన్ని ప్రాంతాల్లో నాలా రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సి ఉందన్నారు. కొన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా దెబ్బతిన్నందున తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. ముందస్తు చర్యలు చేపట్టకపోతే గతంలో మాదిరిగానే వందలాది నివాసాలు నీట మునిగే ప్రమాదముందన్నారు.జీహెచ్‌ఎంసీలో తరహా కంటోన్మెంట్‌లోనూ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్)ను ఏర్పాటు చేయాలని కోరగా సంబంధిత అధికారులతో సమీక్షించి, తగిన చర్యలు చేపడతామని సీఈఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

'ఉస్మానియా' సమస్యలు పరిష్కరించాలి

ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు పీవైఎల్ వినతి



ముషీరాబాద్: ఉస్మానియా ఆసుపత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) డిమాండ్ చేసింది. గురువారం ఆసుపత్రి సూపరెండెంట్ బి.నాగేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై రోగుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజూ అవుట్ పేషంట్లు భారీ సంఖ్యలో వస్తున్నందున ఫార్మసీ వద్ద ఎనిమిది కౌంటర్లు ఏర్పాటు చేసినా తీవ్ర జాప్యమవుతోందని, వృద్ధులు సైతం బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. అన్ని రకాల మందులు అందుబాటులో లేవని కొన్ని మందులు సగమే ఇస్తున్నారని చెప్పారు. బ్లడ్, ఇతర టెస్టులు, ఫలితాలకు ఎక్కువ రోజుల సమయం తీసుకోవడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. నూతన బిల్డింగ్ నిర్మాణం చేపడితే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.రవికుమార్, బి.ఎస్.కృష్ణ, ఉపాధ్యక్షులు కొల్లూరి భీమేష్, కొల్లూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్‌వర్క్ లేక రోడ్డు అధ్వానం

షేర్ అలీ వీధిలో అవస్థలు


షేర్‌అలీ వీధిలో అధ్వానంగా మారిన రోడ్డును చూపిస్తున్న స్థానికులు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ షేర్ అలీ వీధిలో అధ్వానంగా మారిన రోడ్లతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఏడాది క్రితం డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డు తవ్వారు. నిర్మాణ పనులు పూర్తి చేసిన తర్వాత ప్యాచ్ వర్క్ చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పెంటయ్య, విజయ, రూప తదితర స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నడవడానికి సైతం వీలు లేని పరిస్థితి ఏర్పడింది. వాహనదాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేస్తే నిధులు మంజూరయ్యాయి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ రావడం లేదని పేర్కొంటున్నారని వారు తెలిపారు. సంవత్సరం పూర్తికావస్తున్నా పనులు చేపట్టకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

'జీవితంలో విజయం సాధించడం ఎలా..?' పై

రేపు సింపోజియం

కాచిగూడ: వర్ణిక ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 'జీవితంలో విజయం సాధించడం ఎలా..?'అనే అంశంపై ఈ నెల 25న కాచిగూడలోని అమృత ఆర్కేడ్‌లో సింపోజియం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానకార్యదర్శి, న్యాయవాది కాసుల వినోద్ తెలిపారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ సింపోజియం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎస్‌ఎస్ న్యాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ప్రోగ్రెసివ్‌రైటర్స్ అసోసియేషన్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్, ప్రత్యేక అతిథిగా హైకోర్టు న్యాయవాది కానుగు దేవేందర్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కంప్యూటర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీమాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు ప్రతీ విద్యార్థి నేర్చుకోవాల్సిన 50కిపైగా లేటెస్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 95058 00050లో సంప్రదించాలి.



నిధులు మంజూరైనా.. పట్టాలు దాటని పనులు!

- సనత్‌నగర్–బాలానగర్ మార్గాల్లో ఆర్‌యూబీ ఆశలు తీరేదెన్నడో?
- నిత్యం ట్రాఫిక్ జామ్
- పనులు పూర్తయితే ప్రయాణం సునాయాసం


ఆర్‌యూబీ పూర్తయితే సనత్‌నగర్ నుంచి బాలానగర్‌కు వెళ్లే మార్గం ఇదే

సనత్‌నగర్: రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. ప్రస్తుతం ఉన్న రహదారులు అంతకంతకూ పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలను తీర్చలేకపోతున్నాయి. మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలను అనుసంధానం చేసే ఫతేనగర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ జాంఝాటంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. జీడిమెట్ల, షాపూర్‌నగర్, చింతల్, బాలానగర్ వైపు ఫతేనగర్, బల్కంపేటల మీదుగా ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట వైపు నగరంలోకి వెళ్లేందుకు చాలా దగ్గరి దారి కావడంతో ఎక్కువ మంది ఈ రహదారినే ఎంచుకుంటారు. మరోవైపు ఎర్రగడ్డ, సనత్‌నగర్ వైపు వెళ్లేందుకు ఫతేనగర్ బ్రిడ్జినే ఆశ్రయించాల్సిందే. ఈ క్రమంలో సనత్‌నగర్ ప్రధాన రహదారిపై రద్దీ విపరీతంగా పెరిగింది. ఇక ఆదివారం వచ్చిందంటే సండే మార్కెట్‌తో వాహనాలు కదల్లేని పరిస్థితి ఉంటుంది.

కిలో మీటర్ మేరకు ట్రాఫిక్ జామ్..

పెరిగిన వాహనాలకు అనుగుణంగా ఫతేనగర్ ఫ్లై ఓవర్ లేకపోవడం, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడడం నిత్యకృత్యంగా మారింది. ఫతేనగర్ బ్రిడ్జి విస్తరణతో పాటు సమాంతరంగా సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా నుంచి రైలు పట్టాల కిందుగా ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టి బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాకు అనుసంధానం చేయాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఆ ప్రాజెక్టు ప్రతిపాదనలకు నిధులు కూడా మంజూరై ఏడాది గడిచినా ఆర్‌యూబీ నిర్మాణం ఇంకా పట్టాలు దాటలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక అసలు ఈ ప్రాజెక్టు ఊసెత్తడం లేదు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ విస్తరణ కోసం ఆస్తులు సేకరించాల్సి ఉన్నందున కాస్త ఆలస్యమయ్యే ప్రక్రియ కాగా, ఆర్‌యూబీ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో వెంటనే పనులు ప్రారంభించే అవకాశం ఉన్నా అధికారులు మాత్రం దీనివైపు కన్నెత్తి చూడకపోవడానికి కారణం ఏంటోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రూ.68.30 కోట్ల వ్యయంతో..

సనత్‌నగర్ పారిశ్రామికవాడ నుంచి బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాను కలిపే ఈ ప్రాజెక్టులో భాగంగా ఆర్‌యూబీ నిర్మాణం అత్యంత కీలకం. గత ప్రభుత్వంలో ఆర్‌యూబీ నిర్మాణం కోసం రైల్వే శాఖకు కూడా జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు చెల్లించినట్లుగా అప్పటి బీఆర్‌ఎస్ పాలకులు చెప్పారు. అయితే ఇంత వరకు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌డీసీఎల్), రైల్వే శాఖలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి. అందుకోసం సర్వే కూడా పూర్తి చేసి మొత్తం 2.34 కిలో మీటర్ల మార్గంలో 600 మీటర్ల మేర రైలు పట్టాల కిందుగా నగరంలోనే అతి పొడవైన ప్రాజెక్టుగా అండర్‌పాస్ నిర్మాణం జరపాలని ప్రణాళికలు రూపొందించారు. మొత్తం నాలుగు లేన్లుగా సనత్‌నగర్ పారిశ్రామికవాడ నుంచి సనత్‌నగర్–ఫతేనగర్ రైల్వే లైన్ల కింది నుంచి నిర్మించే అండర్‌పాస్ బ్రిడ్జి పనులను గతంలో మంత్రులుగా ఉన్న కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. మొత్తం రూ.68.30 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో సుమారు రూ.40 కోట్లను రైలు పట్టాల కిందుగా అండర్‌పాస్ నిర్మించడం కోసం రైల్వేశాఖకు కేటాయించారు. సికింద్రాబాద్–ముంబాయి లైన్‌లో ఉన్న ఏడు రైలు పట్టాల కిందుగా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్‌కు చెక్

ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయితే సనత్‌నగర్ ప్రధాన రహదారితో పాటు ఫతేనగర్ ఫ్లైఓవర్‌పై వాహన ఒత్తిడిని తగ్గించవచ్చు. ఈ నిర్మాణం పూర్తయితే సనత్‌నగర్ నుంచి నర్సాపూర్ చౌరస్తాకు కేవలం ఐదు నిమిషాలు, మరోవైపు ఎర్రగడ్డ నుంచి బాలానగర్‌కు 10 నిమిషాల వ్యవధిలోనే చేరుకునే వెసులుబాటు కలుగుతుంది. మరోవైపు జాతీయ రహదారితో పాటు ఇరుకైన ఫతేనగర్ బ్రిడ్జి మార్గంలో కూడా రద్దీ తగ్గే అవకాశం ఉంటుంది. ఎన్నో ప్రయోజనాలు ఉన్న ఈ ప్రాజెక్టును పట్టాలు దాటించే అంశంపై జీహెచ్‌ఎంసీ, రైల్వే శాఖ అధికారులు దృష్టిసారించాలని స్థానికులు, వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

31న ఫీజుల నియంత్రణపై రౌండ్‌టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ–ఆవశ్యకత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 31న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జస్టిస్ చంద్ర కుమార్ హాజరు కానున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 135, గింజ బీక్కుడు 70, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, రూట్ రూట్ 19, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 32, చామగడ్డ 45, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

మాజీ వీసీలపై విచారణ చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వివిధ వర్సిటీలలో వీసీలుగా పని చేసిన వారిపై విచారణ చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు తొత్తులుగా వ్యవహరిస్తూ వర్సిటీల అభివృద్ధిని అడ్డుకొని స్వయంప్రతిపత్తిని (అటానమస్) బలహీన పరిచారని ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ వీసీలపై విచారణ జరపాలన్నారు.

ఓయూ మాజీ వీసీపై..

కేయూ మాజీ వీసీపై తీసుకున్న చర్యల తరహా ఓయూ మాజీ వీసీ ప్రొ.రవీందర్‌పై తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వేతన బకాయిల చెల్లింపు, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు, పదవులు, పదోన్నతుల అక్రమాలపై ప్రశ్నించిన అధ్యాపకులను ముప్పు తిప్పలు పెట్టిన మాజీ వీసీ ప్రొ.రవీందర్ పై కూడా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తన మూడేళ్ల పాలనలో ఇష్టారాజ్యాంగా వ్యవహరించిన ప్రొ.రవీందర్ సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులపై ప్రొ.తిరుపతిరావు సమర్పించిన నివేదికను బహిర్గతం చేయలేదన్నారు. 2016 నుంచి 2019 వరకు గల అధ్యాపకులందరికి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

సీనియర్ డీపీఓ అభిలాష్ సేవలు అభినందనీయం



అభినందన సభలో పాల్గొన్న అధికారులు, యూనియన్ ప్రతినిధులు

చిలకలగూడ : ఎస్సీ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎడ్ల అభిలాష్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న సీనియర్ డీపీఓ అభిలాష్‌కు శాలువా కప్పి సన్మానించారు. వేలాది మంది ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించిన ఘనత అభిలాష్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోనల్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, శంకరరావు, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజాబాబా, రవీందర్, ప్రతినిధులు ఉదయభాస్కర్, భరాటీ, సంజీవయ్య, చిలుకుస్వామి, నాగలక్ష్మీ, శ్రీనివాస్, రమేష్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రహరీ.. ఇబ్బందిగా మారి!



ఉస్మానియా యూనివర్సిటీ: హబ్సిగూడ వైపు నూతనంగా నిర్మిస్తున్న సెంటినరీ అడ్మిస్ట్రేషన్ బిల్డింగ్ చుట్టూ రూ. కోటి వ్యయంతో ప్రహరీ నిర్మిస్తున్నారు. క్యాంపస్‌లోని అధ్యాపకుల ఫ్యాకల్టీ క్లబ్‌కు వెళ్లేమార్గం రోడ్డుపైనే ప్రహరీ నిర్మిస్తున్నారు. రోడ్డుకు కనీసం 30 అడుగుల దూరంలో నిర్మించాలి కానీ.. అడ్డగోలుగా చేసిన ప్లానింగ్‌తో రోడ్డు పైనే నిర్మించడంతో దారి కుంచించుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఫ్యాకల్టీ క్లబ్‌లో వివిధ శుభకార్యాలయాలు జరిగే సమయంలో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు సాగించే క్రమంలో ఇబ్బంది ఏర్పడుతుంది. ప్రహరీని రోడ్డుకు దూరంగా నిర్మించాలని లేని పక్షంలో రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకుంటామని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీఏస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌కుమార్ హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తాతాచారికాలనీ, బొంబే హల్వా కాంపౌండ్, పోచమ్మ బస్తీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, వాణి ప్రింటర్స్ ఏరియా. మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు సూర్యోదయ కాంప్లెక్స్, నల్లి సిల్క్ శారీస్ ఏరియా.మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు గురుమూర్తిలేన్, తాతాచారికాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, బొంబే హల్వా కాంపౌండ్.మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బేగంపేట పోస్టాఫీసు, గీతాంజలి స్కూల్, బేగంపేట రైల్వేస్టేషన్ ఏరియా, ఓల్డ్ కస్టమ్స్ బస్తీ, పీఎఫ్ క్వార్టర్స్, బ్రాహ్మణవాడీ, వరుణ్ టవర్స్ లేన్, మాతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

పశ్చిమబెంగాల్ కోర్టు తీర్పుపై హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఓబీసీలలో అన్ని క్లాస్‌లను కొట్టివేస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల బీజేపీ ఓబీసీ మోర్చా నేతలు హర్షం వ్యక్తం చేశారు. బేగంపేట బ్రాహ్మణవాడీలోని వినాయక మండపం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్ కన్నూరి చంద్రకుమార్, బేగంపేట డివిజన్ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, రాంగోపాల్‌పేట ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, పవన్, వెంకటేష్, యశ్వంత్ సమావేశమై హర్షం ప్రకటించి సంబురాలు జరుపుకున్నారు. పశ్చిమబెంగాల్ హైకోర్టు తీర్పు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు చేస్తూ తీర్పు ఇవ్వడం శుభపరిణామం అన్నారు.

ప్రాణాలను కాపాడే ఆయుధం హెల్మెట్


హెల్మెట్లు ధరించిన ట్రాఫిక్ సిబ్బంది, వారి పిల్లలు

సనత్‌నగర్: హెల్మెట్ అనేది ఒక వస్తువు కాదని.. అది ప్రాణాన్ని కాపాడే ఆయుధమని.. మేము హెల్మెట్ ధరిస్తున్నాం..మీరూ ధరించండి అంటూ ట్రాఫిక్ సిబ్బంది, వారి పిల్లలు హెల్మెట్లు ధరించి ప్రదర్శించారు. బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది, వారి పిల్లలకు గురువారం ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు–నివారణ అంశంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అన్నారు. వాహనం నడిపే వారి ప్రాణాలు ఎంత ముఖ్యమో వెనుక కూర్చొన్న వారి ప్రాణాలు కూడా అంతే ముఖ్యమన్నారు. సెల్‌ఫోన్ పగలగకుండా ఏ విధంగా స్క్రీన్‌గార్డ్, పౌచ్‌లు వేయిస్తామో.. మనిషి ప్రాణాలు పోకుండా హెల్మెట్ ధరించడం అంతకన్నా ముఖ్యమన్నారు. ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ట్రాక్స్ ఎస్ సొసైటీ రోడ్డు సేఫ్టీ సహకారంతో హెల్మెట్లను పంపిణీ చేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఆలస్యంగా వెలుగులోకి..


మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

అమీర్‌పేట: కల్లు దుకాణం వద్ద పడిపోయిన ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 20న సనత్‌నగర్ స్వామి థియేటర్ చౌరస్తాలోని కల్లు దుకాణం వద్ద ఓ మహిళ పడి ఉందని సమాచారం అందుకున్న పోపలీసులు 108 సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మహిళను పరీక్షించి అపస్మారక స్థితిలో ఉన్నట్లు నిర్ధారించి చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 21న మధ్యాహ్నం సదరు మహిళ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు ఎవరన్నది తెలియకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతిగా కేసు నమోదు చేశారు.

- కల్లు దుకాణం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న మహిళను ఆసుపత్రిలో చేర్పించిన పోలీసులు చికిత్స పొందుతూ మృతి చెందిన విషయాన్ని ఆలస్యంగా వెల్లడించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదం బారిన పడ్డా లేదా మృతి చెందినా వెంటనే ప్రసార మాధ్యమాల ద్వారా తెలిపే పోలీసులు కల్లు దుకాణం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న మహిళ ఆసుపత్రిలో మృతి చెందిన విషయాన్ని రెండ్రోజుల తర్వాత అది కూడా వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి చేతులు దులుపుకోవడంపై అనుమానాలకు తావిస్తోంది. దీనిపై ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కబ్జాలపై కన్నెర్ర!




అధికారులూ.. కబ్జాలు చూడరూ!
సాక్షిలో ప్రచురితమైన కథనం

లాలాపేట: తార్నాక చౌరస్తాలో ఉన్న ఓ పెట్రోల్ బంక్ యజమాని యథేచ్ఛగా ఫుట్‌పాత్‌తో పాటు ప్రధాన రహదారిని ఆక్రమించి చెట్లు నాటాడు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్యపై ఈ నెల 15న 'అధికారులూ.. కబ్జాలు చూడరూ'అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో గురువారం సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బోర్డులు, రోడ్డుపై నాటిన చెట్లను తొలగించి ఫుట్‌పాత్‌పై నిర్మించిన గోడను కూల్చివేశారు. వాహనదారుల ఇబ్బందులను వెలుగులోకి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు రజిత, సరిత, సిబ్బంది ప్రకాష్, మౌనిక, నాగయ్య, ఆంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.